
క్లుప్తంగా

కంభంలో పంట కాల్వల సర్వే


కొలతలు వేస్తున్న తహసీల్దార్ కిరణ్

కంభం: కందులాపురం పంచాయతీ పరిధిలోని పంటకాల్వల హద్దులను ఇరిగేషన్ అధికారులకు చూపించినట్లు తహసీల్దార్ వి.కిరణ్ తెలిపారు. సర్వేయర్, వీఆర్వోలు శుక్రవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి కందులాపురం పంచాయతీ పరిధిలో పంట కాల్వలను సర్వే చేశారు. ఆక్రమణలను, పంటకాల్వల హద్దులను ఇరిగేషన్ అధికారులకు చూపించారు. పంటకాల్వలు ఆక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో అందిన ఫిర్యాదుల మేరకు కొలతలు వేయించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, కార్యాలయ రికార్డ్స్ పరిశీలించారు. అభివృద్ధి పనులు, జీఎస్‌డబ్ల్యూఎస్ యాక్టివిటీస్‌పై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, ఈఓపీఆర్డీ షేక్ జిలానీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

మార్కాపురం: మండలంలోని పెద్దనాగులవరం పంచాయితీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మండల అధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేస్తారా.. లేదా?


అధ్వానంగా ఉన్న రోడ్డుపై నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పాములపల్లె రోడ్డును బాగు చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఎం నాయకులు పాములపల్లె రోడ్డులో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు బి.నరసింహులు మాట్లాడుతూ.. 15 ఏళ్ల క్రితం వేసిన తారురోడ్డు పూర్తిగా లేచిపోయి కంకర రాళ్లు పైకి తేలడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. నగర పంచాయతీ చైర్మన్ స్వగ్రామంలో పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా నగర పంచాయతీ పాలకవర్గం స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి తిరునాళ్ల


పొంగళ్లు వండుతున్న మహిళలు


పూజలందుకుంటున్న అభయాంజనేయ స్వామి

పొదిలి రూరల్: పొదిలి మండలం ఏలూరు పంచాయతీలోని ఒంగోలు–కర్నూలు రహదారి పక్కన ముసి బ్రిడ్జి వద్ద కొలువై ఉన్న అభయాంజనేయ స్వామి, వరసిద్ధి వినాయక స్వామి తిరునాళ్ల శుక్రవారం వైభవంగా సాగింది. భక్తులకు ఇబ్బంది కలగకుండా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద ఉన్న కాశిరెడ్డినాయన సత్రంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. రాత్రికి రెండు విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, బ్రహ్మంగారి నాటకం ప్రదర్శన ఏర్పాటు ఏశారు. తిరునాళ్ల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రెండు మెడికల్ షాపులపై కేసులు

కంభం: పట్టణంలోని పలు మెడికల్ షాపులను శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాఘవరావు ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కందులాపురం కూడలిలోని రెండు మెడికల్ షాపుల్లో తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. అధికారులు కేసులు నమోదు చేశారు. నిబంధనలను ఉల్లంఘించి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్రగ్స్ తనిఖీ విభాగం, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని పలు మెడికల్ షాపుల్లో శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈగల్ టీమ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బృందాలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. రెండు దుకాణాల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. విజిలెన్స్ సీఐ రాఘవరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి, ఎస్‌బీ ఎస్సై శ్రీనివాసరావు, ఏఎస్సై మాల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత సంతాన సాఫల్య క్యాంప్

మార్కాపురం: సంతానం లేదని బాధపడే దంపతుల కోసం ×ఫర్టీ కేర్₹ ఆధ్వర్యంలో ఈ నెల 23న మార్కాపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఉచిత సంతాన సాఫల్య క్యాంపు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మార్కాపురం పట్టణంలోని కంభం బస్టాండ్ సెంటర్లో ఉన్న ప్రెస్ క్లబ్‌లో డాక్టర్ శ్రావణి రెడ్డి, డాక్టర్ ఉజ్వల జాస్తి క్యాంపులో పాల్గొని ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పురుషుల్లో వీర్యకణాల సమస్యలున్నవారి కోసం ప్రత్యేక చికిత్స చేస్తారని, స్త్రీలలో పదే పదే గర్భం కోల్పోతున్న వారి కోసం ప్రత్యేక చికిత్స చేస్తారని తెలిపారు. సంతానం లేని వారి కోసం ఐవీఎఫ్ వంటి అధునాతన పద్ధతి ద్వారా ప్రత్యేక చికిత్స చేస్తారన్నారు. పూర్తి వివరాలకు 9490778566, 80191 36251 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


పోటీలను ప్రారంభిస్తున్న షంషేర్ ఆలీబేగ్

మార్కాపురం టౌన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఏపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఏ1 గ్లోబల్ విద్యా సంస్థల చైర్మన్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ పేర్కొన్నారు. శుక్రవారం గ్లోబల్ మహోత్సవ్ టెక్నో కల్చరల్, స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఒంగోలు క్విస్ ఇంజినీరింగ్ కళాశాల, మార్కాపురం ఇందిర ఇంజినీరింగ్ కళాశాల, ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల, జార్జి ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జార్జి కళాశాలపై ప్రకాశం కాలేజీ విద్యార్థులు 29 పరుగుల ఆధిక్యంతో గెలిచారు. ఇందిర ఇంజినీరింగ్ కళాశాలపై క్విస్ కళాశాల విద్యార్థులు 52 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మీర్జా మసూద్ అలీబేగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్, ఎస్‌కే మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తోనే భవిష్యత్తు


సావనీర్‌ను విడుదల చేస్తున్న మాజీ మంత్రి సురేష్, డాక్టర్ సతీష్, చక్రవర్తి తదితరులు

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

మార్కాపురం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తోనే భవిష్యత్తు ముడిపడి ఉందని, మానవ జీవితంలో ఏఐ అంతర్భాగమైపోనుందని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జేఎన్‌టీయే ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఏఎస్ఎన్ చక్రవర్తి, డాక్టర్ ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఎమర్జ్ 2025ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానం లేకుంటే ప్రస్తుత ప్రపంచంలో జీవితాన్ని కొనసాగించడం కష్టమవుతుందన్నారు. విద్య, వైద్య, సాంకేతిక రంగాల్లో ఏఐ ప్రస్థానం కొనసాగుతుందన్నారు. డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ ఎల్.ప్రతాప్‌రెడ్డి, జె. వరప్రసాద్, డాక్టర్ రాహుల్‌విల్సన్, కన్వీనర్ ప్రొఫెసర్ వైవీ ఆది సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

6వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం


ప్రిన్సిపాల్ మారుతీదేవీ

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మారుతీదేవీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 7, 8, 9, 10, సెకండ్ ఇంటర్‌లో మిగిలిన సీట్లకు కూడా దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థినులు https://apkgbv.apcfss.in/ లో ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

వెంకటస్వామి సేవలు మరువలేనివి


అప్పారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పొదిలి: ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు అప్పారి వెంకట స్వామి సేవలు మరువలేనివని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.బాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సంఘ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకట స్వామి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. యూనియన్ నాయకుడు బాదుల్లా మాట్లాడుతూ.. వెంకటస్వామికి 12 ఏళ్ల సర్వీస్ ఉండగానే ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమం కోసం పనిచేశారని కొనియాడారు. అప్పారి త్యాగంతోనే ఉపాధ్యాయులకు మెరుగైన సౌకర్యాలు సమకూరాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బూదాల బుజ్జిబాబు, జేవీవీ రాష్ట్ర నాయకులు సుబ్రహ్మణ్యం, పొదిలి, మర్రిపూడి యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సానికొమ్ము సత్యనారాయణరెడ్డి, పాలడుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన


విద్యార్థినులకు సూచనలిస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: విద్యార్థినులు, మహిళలు శక్తి యాప్ ద్వారా రక్షణ పొందవచ్చని ఎస్సై నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థినులు తమ ఆండ్రాయిడ్ ఫోన్‌లో శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని ఆపద సమయంలో పోలీసుల రక్షణ పొందవచ్చని చెప్పారు. విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన వారి సమాచారం పోలీసులకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

కొమరోలు: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ మస్తాన్‌వలి సూచించారు. మండలంలోని సూరవారిపల్లి, రెడ్డిచెర్ల గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. పనులపై కార్యాలయానికి వస్తున్న ప్రజలను ఎక్కువ సమయం వేచి ఉండేలా చేయవద్దని చెప్పారు. సచివాలయాల పరిధిలో చేస్తున్న పలు సర్వేల వివరాలు సమీక్షించి, వేగంగా పూర్తి చేయాలని ఉద్యోగులకు సూచించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాలు తనిఖీ


బేస్తవారిపేట : పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ జితేంద్రకుమార్

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల, బేస్తవారిపేట జెడ్పీ బాలికల హైస్కూళ్లలో పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. బేస్తవారిపేట బాలుర హైస్కూల్లో 142 మంది విద్యార్థులకుగాను 141 మంది, బాలికల హైస్కూల్లో 190కి 189, పిటికాయగుళ్ల హైస్కూల్లో 139 మందికిగాను 138 మంది హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

■ **రాచర్ల:** మండల కేంద్రమైన రాచర్లలోని మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్ష కేంద్రాలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ వారణాసి గిరిధర్ శర్మ శుక్రవారం తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా చూడాలన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఏబీఎం పాలెంలో నివాసం ఉంటున్న పానుగంటి దానియేలు (48) అనారోగ్యానికి గురై గురువారం మృతి చెందాడు. భార్య సొదమ్మ భర్త అంత్యక్రియలు చేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఇంటి వద్ద భర్త శవాన్ని పెట్టుకుని నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. సొదమ్మ దీన స్థితిపై 'సాక్షి' దినపత్రికలో 'అంత్యక్రియలకు అడ్డొచ్చిన పేదరికం' అనే శీర్షికతో ప్రచురించిన వార్తకు స్పందించిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పాలుగుళ్ల వెంకట శివారెడ్డి, గౌరవ అధ్యక్షుడు గంజి వీరయ్య, కార్యదర్శి దగ్గుపాటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కూరాకు ముత్తెయ్య, తిమ్మాపురం మాజీ సర్పంచి రెడ్డిబోయిన పెద్దయ్యలు స్పందించి మట్టి ఖర్చుల కోసం శుక్రవారం రూ.5 వేలను అందజేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబానికి ఇతర అవసరాల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

రారండోయ్ వేడుక చూద్దాం..

- వరాల కొండ 'వెలుగొండ' ● నేడు గజోత్సవం, తిరునాళ్ల
- రేపు శ్రీవారి రథోత్సవం

కొనకనమిట్ల: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మికత నెలకొంది. ప్రధాన తిరునాళ్లకు వెలుగొండ క్షేత్రం ముస్తాబైంది. ఏటా ఫాల్గుణ శుద్ధ త్రయోదశి మొదలు బహుళ ఏకాదశి వరకు బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. శనివారం గజోత్సవం, తిరునాళ్ల సందర్భంగా ఎడ్ల పోటీలు, రాత్రికి విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు పౌరాణిక నాటకాలు ఏర్పాటు చేశారు. ఆదివారం శ్రీవారి రథోత్సవం వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఈఓ చెన్నకేశవరెడ్డి, సేవా కమిటీ అధ్యక్షులు కుందురు కాశిరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శని, ఆదివారాల్లో జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు.


గరుడోత్సవంలో శ్రీవారు(ఫైల్)

ఆలయ చరిత్ర ఘనం

ఈ క్షేత్రం ముసి నది ఉద్భవించిన పవిత్ర ప్రాంతం. స్వామి వారి పాదాల చెంత నుంచి ముసి నది ప్రవహిస్తుంది. ఇక్కడ ముచుకుంద మహర్షి తపస్సు చేస్తున్నప్పుడు సాక్షాత్తు శ్రీకృష్ణుడు శ్రీమన్నారాయణుని అవతారంలో ప్రత్యక్షమై.. మహర్షి కోరిక మేరకు వెంకటేశ్వరుని రూపంలో కొలువుదీరి పూజలందుకుంటున్నారని భక్తుల విశ్వాసం. వెలుగొండకు కొద్ది దూరంలో బండరాతిలో లక్ష్మమ్మ దొన, నిచ్చెనల దొనలు ఉన్నాయి. మండు వేసవిలోనూ వాటిలో నీరు ఉండటం విశేషం. శ్రీవారిపై అలిగిన ఆయన సతీమణి కొండపైకి చేరగా పీఠ మీద లక్ష్మమ్మగా భక్తుల పూజలందుకుంటున్నారు.

దేవస్థానానికి వెళ్లే మార్గం

పొదిలి నుంచి మార్కాపురం వెళ్లే మార్గంలో నాగిరెడ్డిపల్లి వద్ద నుంచి నాలుగు కిలోమీటర్లు దక్షిణం వైపు ప్రయాణిస్తే వెలుగొండ పుణ్యక్షేత్రం వస్తుంది. పొదిలి–గిద్దలూరు రహదారిలో గొట్లగట్టు నుంచి 12 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వెలుగొండ చేరుకోవచ్చు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శని, ఆదివారాల్లో పొదిలి, మార్కాపురం, కనిగిరి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.


శ్రీవారి రథోత్సవం(ఫైల్)


ముస్తాబైన వెలుగొండ దేవాలయం